


## మిర్యాల ప్రగతికి

# పక్కా ప్రణాళిక

- మునిసిపల్ బడ్జెట్ రూ.76.88 కోట్లు ఆదాయం, రూ. రూ.79.7కోట్లు, లోటు రూ.2.9కోట్లు
- పట్టణాభివృద్ధికి రాజకీయాలకతీతంగా సహకరించాలి : ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మిర్యాలగూడ మున్సిపాలిటీ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆదాయం కంటే వ్యయం అధికం. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో

మిగతా 2లో..




www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

శుక్రవారం । 27 । మార్చి । 2026


## కాంగ్రెస్ వ్యూహం వర్సెస్ బీఆర్ఎస్ బలం



- హరీష్ రావు పట్టు సడలుతుందా?
- రేవంత్ రెడ్డి హామీతో మారుతున్న రాజకీయాలు
- 2029లో నియోజకవర్గ విభజన ప్రభావం

**సిద్దిపేట, అక్షిత బ్యూరో :**

తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన సిద్దిపేట నియోజకవర్గం చర్చనీయాంశంగా మారింది. ఎన్నో ఏళ్లుగా బీఆర్ఎస్‌కు అడ్డాగా నిలిచిన సిద్దిపేటలో ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారుతున్నాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హరీష్ రావు ఆధిపత్యానికి సవాళ్లు పెరుగుతున్నాయా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

### రేవంత్ రెడ్డి హామీతో మారుతున్న రాజకీయాలు.

ఇటీవల నర్మెటలో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేటపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారాయి.

"సిద్దిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రి పదవి ఖాయం" అని ప్రకటించడం ద్వారా ఆయన నేరుగా బీఆర్ఎస్ బలాన్ని సవాల్ చేసినట్టుగా భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ నింపగా, బీఆర్ఎస్ నాయకత్వాన్ని రక్షణాత్మక స్థితిలోకి నెట్టాయని రాజకీయ అనుభజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.

మిగతా 2లో..

## సలేశ్వరం జాతరకు

# సకలం సన్నద్ధం

- సమన్వయంతో పనిచేసి సక్సెస్ చేయాలి
- ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి :**

నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని నల్లమల అడవిలో వెలసిన లింగమయ్య స్వామి ఆలయంలో జరగనున్న సలేశ్వరం జాతర కు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు జరిగే ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు.

జిల్లా



కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సంబంధిత అధికారులతో కలిసి నల్లమల అటవీ ప్రాంతాన్ని సందర్శించి, జాతర ఏర్పాట్లు మరియు ట్రెక్కింగ్ మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడవిలోని క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు

మిగతా 2లో..

## అక్కడ యుద్ధం

# ప్రభావమిక్కడ

- నిల్వలు తగ్గడంతో మూసివేత దిశగా బంకులు

**కాజీపేట్, అక్షిత న్యూస్ :**

పశ్చిమాసియా దేశంలో జరుగుతున్న యుద్ధం వలన ఏదో ఒక రూపంలో ప్రజలపై ప్రభావం చూపుతుంది. డీజిల్ పెట్రోల్ నిలువలు తగ్గుతుండడంతో ఆ ప్రభావం



వినియోగదారులపై పడే సూచనలు కనిపిస్తున్నాయి. బంకులకు పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే ట్యాంకులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో అ ప్రభావము బంకులో ఉన్న నిల్వలపై పడుతుంది . పెట్రోల్ డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రెండు నెలల క్రితమే ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర చమురు సంస్థలు ప్రకటించాయి. ఇప్పటికే పవర్ పెట్రోల్ పై కేంద్ర చమురు సంస్థలు కొన్ని రాష్ట్రాల్లో రెండు రూపాయలు పెంచాయి.

మిగతా 2లో..

- రాములోరి పెళ్లికి రండి
- భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



# తీరొక్క పూలతో సుందరంగా ఆలయం

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ లోని శ్రీమహాశక్తి ఆలయంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. శ్రీరామ నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ ఇబ్బందుల్లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులందరికీ వేదపండితుల ఆశీర్వచనంతో పాటు తలంబ్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామ నవమి వేడుకలు పేరు వినగానే ఠక్కున భద్రాచలం గుర్తుకొస్తుంది. భద్రాద్రి తరువాత ఆ తరహాలో సీతారామచంద్రస్వామి వేడుకలు జరిపేందుకు కరీంనగర్ వేదికగా మారింది. సాధారణ ప్రజలు నిర్వహించే పెళ్లి వేడుకల తరహాలోనే కరీంనగర్ లో రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం



చుట్టారు. హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్యభారతి స్వామీజీ ఆశీస్సులతో ముగ్గురమ్మలు కొలువైన శ్రీ మహాశక్తి ఆలయాన్ని రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకల కోసం అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఒకేసారి 25 వేల మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఎల్ ఈడీ స్క్రీన్లను అమర్చారు. సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ వేద పండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలను అందజేయనున్నారు. ఉదయం 9 గంటలకు సీతారామచంద్రుడి పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు నిర్వహించే అర్చకులు సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఒక్కో ఘట్టాన్ని వివరించనున్నారు. మధ్య మధ్యలో స్వామి వారికి గాన సేవ చేస్తారు.రామయ్య-సీతమ్మ పెళ్లి వేడుకల కోసం శ్రీ మహాశక్తి

మిగతా 2లో..

# కాంగ్రెస్ వ్యూహం వర్సెస్ బీఆర్ఎస్ బలం

మొదటి పేజీ తరువాయి..

### మైనంపల్లి హన్మంతరావు రంగంలోకి?

సిద్దిపేటలో హరీష్‌రావును ఎదుర్కొనే కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి హన్మంతరావు పేరు బలంగా వినిపిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న ఆయన, ఇప్పుడు కాంగ్రెస్ తరఫున బలమైన ప్రత్యర్థిగా మారే అవకాశముందని చర్చ జరుగుతోంది. అందులో భాగంగా సిద్దిపేటలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనడం అలాగే హరీష్ రావుపై పలు రకలా ఆరోపణలు చేశారు, స్థానిక సామాజిక సమీకరణాలు, వ్యక్తిగత ప్రభావం కలిపి మైనంపల్లి అభ్యర్థిత్వం పోటీని మరింత ఉత్కంఠగా మార్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### తగ్గుతున్న బీఆర్ఎస్ మెజార్టీ... హరీష్ పట్టు సడలుతుందా?

సిద్దిపేటలో ఒకప్పుడు భారీ మెజార్టీలతో గెలిచిన హరీష్ రావుకు గత రెండు ఎన్నికల్లో మెజార్టీ తగ్గిన విషయం గమనార్హం.ఇది ఓటర్లలో మారుతున్న అభిప్రాయాలకు సంకేతమా? లేక స్థానిక అంశాల ప్రభావమా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితి కొనసాగితే రాబోయే ఎన్నికల్లో పోటీ మరింత కఠినంగా మారే అవకాశముంది. సిద్దిపేట అంటే హరీష్ రావు అనేలా ఒక బలమైన ఇమేజ్ ఉంది. అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక నెట్‌వర్క్ అన్నిటినితో ఆయనకు బలమైన స్థానం కల్పించాయి. అయితే, కాంగ్రెస్ దూకుడు, ప్రత్యర్థి బలపడటం, మెజార్టీ తగ్గడంతో ఆయన పట్టు కొంత సడలుతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### 2029లో నియోజకవర్గ విభజన ప్రభావం...

మరో కీలక అంశం 2029లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన. సిద్దిపేట రెండు నియోజకవర్గాలుగా విభజించబడే అవకాశం ఉందన్న ప్రచారం కూడా రాజకీయ చర్చకు దారి తీసింది. ఒక వేళ విభజన జరిగితే రెండో వెక్తి ఎవరు అన్న ప్రశ్న కూడా గట్టిగానే ఉంది అలాగే విభజన జరిగితే ప్రస్తుత ఓటు బ్యాంక్ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. కొత్త నాయకత్వానికి అవకాశాలు పెరగడంతో పాటు, పాత ఆధిపత్యాలు తగ్గే అవకాశం కూడా ఎక్కువే

### కాంగ్రెస్ వ్యూహం వర్సెస్ బీఆర్ఎస్ బలం

కాంగ్రెస్ పార్టీ ఈసారి సిద్దిపేటను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం, బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపే ప్రయత్నం పోటీని హై వోల్టేజ్‌గా మార్చుతున్నాయి. మరోవైపు, బీఆర్ఎస్‌కు హరీష్ రావు అనుభవం, స్థానిక బలం ప్రధాన ఆయుధాలు. ఈ రెండు మధ్య పోరు రాబోయే ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరంగా మారనుంది. సిద్దిపేట రాజకీయాలు ప్రస్తుతం కీలక మలుపు వద్ద నిలిచాయి. ఒకవైపు హరీష్ రావు అనుభవం, బలమైన పట్టు ఉండగా, మరోవైపు కాంగ్రెస్ దూకుడు, మైనంపల్లి వంటి అభ్యర్థి అవకాశాలు కలిసి పోటీని తీవ్రతరం చేస్తున్నాయి. ఏది ఏమైనా రాబోయే ఎన్నికల్లో సిద్దిపేట ఫలితం తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పవచ్చు.

# తీరొక్క పూలతో సుందరంగా ఆలయం

మొదటి పేజీ తరువాయి..

ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలతో ముస్తాబు చేస్తున్నారు. తీరొక్క పూలతో దేవాలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. విద్యుత్ కాంతులతో ధగధగ లాడేలా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. విశాలమైన పెళ్లి పందిరిని ఏర్పాటు చేసి పూలతో అలంకరిస్తున్నారు. ఎండాకాలం కావడంతో నవమి



వేడుకలకు హాజరయ్యే భక్తులకు, చిన్నారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ప్రతి ఒక్క భక్తుడి దాహార్తిని తీర్చేందుకు మంచి నీళ్లు, మజ్జిగను అందుబాటులో ఉంచారు.శ్రీ మహాశక్తి ఆలయంలో సీతమ్మ–రామయ్య పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులకు భోజన, ప్రసాదాలు సైతం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 25 వేల మంది భక్తులు నవమి వేడుకలకు హాజరవుతారని అంచనా వేస్తున్న ఆలయ నిర్వాహకులు అందరికి సరిపడా భోజనాలు, ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. పెళ్లి సమయంలో ఏ విధంగా భోజనాలను సిద్ధం చేస్తారో... అదే తరహాలో మూడు రకాల కూరలు, సాంబార్, పెరుగు, స్వీట్, పులిహోర సహా ప్రత్యేక వంటకాలను వడ్డించేందుకు సిద్ధమయ్యారు. భక్తులకు భోజన సమయంలో క్యూ కట్టే పనిలేకుండా 5 స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నారు.

# సలేశ్వరం జాతరకు సకలం సన్నద్ధం

మొదటి పేజీ తరువాయి..

కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి సంవత్సరం సలేశ్వరం జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి మరింత రద్దీ ఉండే అవకాశముందని పేర్కొన్నారు.

భక్తుల సౌకర్యం కోసం తాగునీటి సరఫరా, వైద్య సేవలు, తాత్కాలిక శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అడవి మార్గాల్లో దర్శనానికి వచ్చే భక్తుల కోసం స్పష్టమైన మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక సూచనలు ఉంచడం, అవసరమైన చోట్ల సిబ్బందిని నియమించడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా శుభ్రత నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చెత్తను నియంత్రించే చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. జాతర సమయంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు వైద్య బృందాలు, అత్యవసర సేవల సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాల నివారణ కోసం ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బంది, ఫైర్ ఇంజిన్లను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

భక్తుల రద్దీని నియంత్రించేందుకు ముఖ్య ప్రాంతాల్లో మైక్ సిస్టమ్ ఏర్పాటు చేసి సమాచారం అందించేలా చూడాలని, పోలీస్ శాఖ ద్వారా ప్రత్యేక ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఎవరైనా తప్పిపోయిన సందర్భంలో వెంటనే గుర్తించి కుటుంబ సభ్యులకు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో స్వామి దర్శనం కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు.

రాబోయే వేసవి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో తాగునీటి సరఫరాను విస్తరించడంతో పాటు చల్లని నీడ కల్పించే శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు తాత్కాలిక షెడ్లు, టెంట్లు ఏర్పాటు చేయడం, సమస్యలు తలెత్తకుండా వైద్య శిబిరాలను సిద్ధంగా ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే చికిత్స అందేలా వైద్య సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. మహిళలు ఇబ్బందులు ఎదుర్కోకుండా వారికి ప్రత్యేకంగా నీటి సరఫరాతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించినారు.సలేశ్వరం జాతర నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గర్భిణీ మహిళలు, వృద్ధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న భక్తులు జాతరకు రాకుండా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నల్లమల అడవిలోని కఠినమైన ట్రెక్కింగ్ మార్గాలు, ఎత్తైన ప్రదేశాలు, వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు వంటి పరిస్థితులు ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ఈ సూచనలు చేసినట్లు తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందుబాటులో ఉన్నప్పటికీ, ఇలాంటి వర్గాల భక్తులు జాగ్రత్తగా ఉండడం మంచిదని అన్నారు. ఇతర భక్తులు కూడా ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జాతరకు హాజరుకావాలని సూచించారు. భక్తులందరూ సురక్షితంగా ఉండటం ప్రధాన లక్ష్యమని, అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ స్వామి దర్శనం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

# మిర్యాల ప్రగతికి పక్కా ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి..

గురువారం లోటు బడ్జెట్ ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. ఇందులో 2026–27 ఆర్థిక సంవత్సరానికి రూ.76.88 కోట్ల ఆదాయం, రూ.79.70కోట్లు అంచనా వ్యయం చూపగా ఈ మేరకు ఆమోదించారు.

పన్నులు 16.92 కోట్లు పన్నేతర ఆదాయం 9.20 కోట్లు, గ్రాంట్లు 48 కోట్ల 56 లక్షలు, డిపాజిట్లు, అప్పుల రూపంలో రెండు కోట్ల 20 లక్షల రూపాయలు చూపించారు. మొత్తంగా 76.88 కోట్లు ఆదాయ అంచనా బడ్జెట్ రూపొందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చార్జెడ్ వ్యయం 20.25 కోట్లు ఇతర నిర్వహణ వ్యయం 48.8 కోట్లు డిపాజిట్లు అడ్వాన్సులు 2.20 కోట్లు మున్సిపల్ పన్ను నుండి అభివృద్ధి పనులు 3.81 కోట్లు మొత్తంగా 79.70 కోట్లు వ్యయంగా చూపించారు. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం నుండి జీతాలు పొరుగు సేవలు ఉద్యోగాల జీతాలు వారు సిద్ధ నిర్వహణ కరెంటు బిల్లులు, రుణ వాయిదాల చెల్లింపు, 10 శాతం నిధులను హరిత హారం పనులకు కేటాయించారు. అదేవిధంగా మున్సిపల్ నిధుల నుండి 1/3 వంతు నిధులను పురపాలక సంఘంలో విలీనమైన గ్రామాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజల నివసించే ప్రాంతాలలో, మురికివాడలో ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పన కోసం బడ్జెట్లో కేటాయింపులు చేశారు. మిగిలిన మున్సిపాలిటీ నిధులను పార్కులు, వైకుంఠ దామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, సమీకృత మార్కెట్ అభివృద్ధి, జంతు వధ శాలల నిర్మాణం, శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డుల నిర్వహణ,



వివిధ వార్డులలో అభివృద్ధి పనులకు కేటాయింపులు చేశారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను ఆదాయ వ్యయాలను క్లుప్తంగా వివరించారు. సమావేశంలో 23 అంశాల ఏజెండాను సభ్యుల ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ దుకాణ సముదాయంలోని 180 షాపులకు బహిరంగ వేలం నిర్వహించుటకు సభ్యులు ఆమోదం తెలిపారు. వేసవికాలం దృష్ట్యా పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి సరఫరా నిర్వహణ, వివిధ వార్డులలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ఆమోదం తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముందుగా మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి రాజకీయాలకతీతంగా సహకరించాలన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చేసి జిల్లాలో మిర్యాలగూడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. పట్టణాభివృద్ధి కోసం కౌన్సిలర్లు తమ వంతు కృషి చేయాలన్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, మున్సిపల్ డిఇఇ వెంకన్న, ట్రాన్స్కో డిఈ శ్రీనివాసచారి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# అక్కడ యుద్ధం ప్రభావమిక్కడ

మొదటి పేజీ తరువాయి..

**ఉత్పత్తి రంగాలపై ప్రభావం:** పెట్రోల్, డీజిల్ ఆధారంగా చేసుకుని ప్రత్యక్షంగా పరోక్షంగా ఉత్పత్తి అయ్యే అన్ని రంగాలపై చమురు నిల్వలు ప్రభావం చూపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉత్పత్తి చేసిన వస్తువులను రవాణా చేయడానికి ఈ నిల్వలు ఎంతగానో దోహదం చేస్తాయి. ముఖ్యంగా రవాణా రంగంపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. భవిష్యత్తులో అన్ని రకాల వస్తువులపై ధరలు పెరిగే అవకాశం ఉందని రవాణా రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే హోటళ్లు, వ్యాపార, చిన్న మధ్యతరహ పరిశ్రమలు ధరలు పెంచడానికి సిద్ధంగా ఉన్నాయి .తాజాగా ప్లాస్టిక్ బాటిళ్లు, మూతల ధరలు పెరగడంతో బాటిల్ నీటిపై 11శాతం ధరను పెంచేశారు.

**వినియోదారుల ఆందోళన:** దేశవ్యాప్తంగా కొన్ని రకాల వస్తు, సేవలపై ధరలు పెరుగు తుండడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోజువారిగా ఉపయోగించే వంట నూనెలు,పప్పులు, పల్లిలు, ప్లాస్టిక్ ధరలు రోజురోజుకు పెరుగు తున్నాయి. దీనివల్ల చిరు వ్యాపారాలకు, రిటైల్ వ్యాపారులకు ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మూసివేత దిశగా పెట్రోల్ బంకులు:** పెట్రోల్ డీజిల్ నిల్వలు తగ్గిపోవడంతో చాలా వరకు పెట్రోల్ బంకులు మూతపడే దిశగా కనపడుతుంది. యుద్ధ పరిణామాలు ప్రజల్లోకి వెళ్లిపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రీమియం పెట్రోల్ ధర లీటరుకు రెండు రూపాయలు పెరిగింది.

## మిల్స్ కాలని ఎస్సై సురేష్ సస్పెండ్

**ఆరోపణలు రుజువు కావడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ సిపి**

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లాలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం. సురేష్‌ను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.ఐపై వచ్చిన ఆరోపణలు అధికారుల విచారణలో రుజువుకావడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఇదే పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న మరో ఎస్సై కూడా




సివిల్ విషయాల్లో జోక్యం చేసుకుంటూ.. తన పర్సనల్ నంబర్ నుండి ఫోన్ లు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నట్లు సమాచారం. తప్పు చేస్తే చట్టం ముందు అందరు సమానమైన అని ఎవరి విధులు బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తించకపోతే చట్టపరమైన చర్యలకు శిక్షార్హులవు తారని వరంగల్ పోలీస్ కమిషనర్ అన్నారు.

## యువత వ్యాపార రంగంలో రాణించాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 32 వార్డు కౌన్సిలర్ పాశం శ్రీనివాస్ రావు**

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** యువత వ్యాపార రంగంలో ఎదగాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 32 వ వార్డు కౌన్సిలర్ పాశం శ్రీనివాస్ రావు అన్నారు కోదాడలో నూతనంగా ఏర్పాటు చేసిన గోల్డ్ వర్క్ షాప్ ను ప్రారంభించి మాట్లాడారు యువత సమాజాభివృద్ధిలో సమాజ సేవలో



ముందుండాలని అదేవిధంగా వ్యాపార రంగంలో ఎదగాలని షాపు నిర్వాహకులు వెనిగళ్ళ వెంకటేశ్వరరావు వ్యాపార రంగంలో మంచి పేరు సంపాదించుకోవాలని అన్నారు కార్యక్రమంలో చింతలపొట్టి శ్రీనివాస రావు, హరీష్, సుధా ప్రకాష్, ప్రతాప్, గాదంశెట్టి సంతోష్ ,పందిరి వెంకటరెడ్డి, ముత్తిరెడ్డి పూర్ణచందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**వరంగల్, అక్షిత బ్యూరో:**

చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించి,





రోగులకు అందుతున్న చికిత్స విధానంపై ఆరా తీశారు. ఔషధ నిల్వలను పరిశీలించి, అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి,జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# 'గుంపులో గోవిందా'.. పెట్రోల్ క్యూల వెనుక అసలు గేమ్?

**ఉమ్మడి నల్గొండ, అక్షిత బ్యూరో:**

రాష్ట్రంలో పెట్రోల్ కొరత ఉందంటూ వస్తున్న వార్తలపై ప్రభుత్వం, పెట్రోలియం అసోసియేషన్ క్లారిటీ ఇచ్చినా.. బంకుల వద్ద జనం బారులు తీరడం ఆగడం లేదు. నిజానికి మన దగ్గర ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి, కానీ ఒక వింత పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. లేని డిమాండ్‌ను ఉన్నట్లుగా భ్రమపడటమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం అని తెలుస్తోంది. కావాలని బ్యాక్ గ్రౌండ్ లో సరుకు చకచకా అమ్మేసుకోవలనే ప్లాన్ లో కొందరు బంక్ యజమానులు ఫేక్ న్యూస్ లు వైరల్ చేశారనే ఆరోపణలు వస్తున్నాయి.సాధారణంగా ఒక లోకల్ పెట్రోల్ బంక్ అండర్ గ్రౌండ్ ట్యాంక్ సామర్థ్యం సుమారు 20,000 లీటర్లు ఉంటుంది. రోజుకు ఒక 500 మంది వచ్చి వంద, రెండు వందల రూపాయల పెట్రోల్ కొట్టించుకుంటే, ఆ స్టాక్ కనీసం మూడు నాలుగు రోజుల పాటు హాయిగా వస్తుంది. కానీ ఎక్కడో ఎవరో చెప్పిన 'రేపటి నుండి పెట్రోల్ దొరకదట' అనే ఒక చిన్న ఫేక్ న్యూస్, వేలాది మందిని ఒకేసారి రోడ్డు మీదకు తెచ్చింది. ప్రతి ఒక్కరూ తమ ట్యాంకులను ఫుల్ చేయించుకోవాలని చూడటంతో, నాలుగు రోజులు రావాల్సిన స్టాక్ కేవలం నాలుగు గంటల్లోనే ఖాళీ అయిపోతోంది.అంటే బంక్ దగ్గర ఒక పది మంది లైన్ లో నిలబడితే, పక్కన వెళ్లేవారు కూడా ఏదో అయిపోతుందనే భయంతో వచ్చి లైన్ లో నిలబడతారు. దీనివల్ల బంక్ యజమాని 'నో స్టాక్' బోర్డు పెట్టాల్సి వస్తుంది. ఆ బోర్డును చూసిన మరికొందరు ఇది నిజమైన కొరత అని ఫిక్స్ అయిపోయి మరింత పానిక్ అవుతున్నారు. నిజానికి దేశవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలు చాలా పక్కాగా ఉన్నాయి. ముంబై తీరానికి లక్ష టన్నుల ముడి చమురుతో కూడిన ట్యాంకర్లు సురక్షితంగా



చేరుకున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా ఇరాన్ యుద్ధ పరిస్థితుల వల్ల రేట్లు పెరగవచ్చనే ప్రచారం కూడా ఈ భయానికి ఒక కారణం. అయితే ప్రభుత్వం ఇప్పటికే మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని భరోసా ఇచ్చింది. అనవసరంగా పెట్రోల్ నిల్వ చేసుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది తప్ప, ఎవరికీ లాభం లేదు. ఈ విషయంలో వాహనదారులు ఎవరి మాటలో విని ఆందోళన చెందకుండా, వాస్తవాలను గమనించాలని ఇప్పటికే పోలీసులు కూడా క్లారిటీ ఇచ్చారు.గుంపులో గోవిందాలా అందరితో కలిసి భయపడటం కంటే, డేటా అండ్ ఫాక్ట్స్ తో ఆలోచించడం ముఖ్యమనే విషయం గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా ఇంధన సమస్య లేదు. ఈ కృత్రిమ కొరతను సృష్టించింది కేవలం ఫేక్ న్యూస్ మాత్రమే అని తెలుస్తోంది. అయితే ప్రభుత్వం కూడా ఈ విషయంలో జనాలకు మరింత క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం కూడా ఉందని మరికొందరు చెబుతున్నారు.



## శ్రీరామ నవమి శోభాయాత్రకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**భైంసాలో డ్రోన్ కెమెరాలతో నిఘా**

**- శాంతి భద్రతలపై ఎస్పీ జానకి షర్మిల సమీక్ష**

**నిర్మల్ అక్షిత బ్యూరో:** భైంసా పట్టణంలో శుక్రవారం రోజు జరగనున్న శ్రీరామ నవమి శోభాయాత్రల సందర్భంగా భైంసాలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ సమీక్ష నిర్వహించారు. భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో భద్రతా చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, శోభాయాత్రలు శాంతియుతంగా, సాఫీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక




పహారా ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ, అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. శోభాయాత్ర మార్గాలలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో భైంసా సబ్‌డివిజన్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, రవీందర్, సాయి కుమార్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

**పోలీస్ శాఖ పెండింగ్ సమస్యలపై 40% అన్యాయం వెంటనే పరిష్కారం చేయాలి**

**శాసనసభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నాయిని.**

**కాజీపేట్, అక్షిత న్యూస్:** రాష్ట్ర శాసనసభలో గురువారం జరిగిన సమావేశంలో వరంగల్ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కీలక ప్రజా సమస్యలను సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.



ముఖ్యంగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు అధిక శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించిన కోచ్ ఫ్యాక్టరీ ద్వారా ప్రాంతీయ యువతకు ఉపాధి ,ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆధ్వర్యంలో సుమారు 20 కోట్ల నిధులు కేటాయించి భూ సేకరణ చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

విభజన చట్టంలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశంలో సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై అన్ని పార్టీల ఎమ్మెల్యేలు మద్దతు తెలపాలని ఆయన కోరారు.

మల్టీ జోన్ ప్రమోషన్లు, ఏఆర్ నుంచి సివిల్ విభాగానికి కన్వర్షన్ వంటి అంశాలు చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటాన్ని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. 40 శాతం రిజర్వేషన్ అమలు కాకపోవడం వల్ల పోలీస్ సిబ్బందికి తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఈ సమస్యలను పరిష్కరించాలని సభ ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు.

# జడ్చర్ల లెదర్ పార్కును ప్రారంభించండి

**చెత్త కాలుస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోండి**

**ఉదండాపూర్ వద్ద టూరిజం హోటల్ మంజూరు చేయండి**

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**జడ్చర్ల, అక్షిత ప్రతినిధి:** ఉదరిజర్వాయర్ వద్ద పర్యాటకులను ఆకర్షించే విధంగా ఒక టూరిజం హోటల్ నిర్మించాలని, పర్యాటకుల కోసం బోట్లను ఏర్పాటు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. అలాగే పోలేపల్లి సమీపంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన లెదర్ పార్కును తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో పాటుగా ఫార్మా సెజ్ ప్రాంతంలోని కొన్ని పరిశ్రమలు పొలాల్లో చెత్తను డంప్ చేసి దాన్ని కాలుస్తుండటంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని, దీనికి కారణమైన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కూడా ఎమ్మెల్యే కోరారు.

గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశం జీరో అవర్ లో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద పర్యాటకులు బస చేయడానికి ఒక టూరిస్ట్ హోటల్ ను ఏర్పాటు చేయాలని, అటవీ ప్రాంతం కూడా రిజర్వాయర్ కు సమీపంలోనే ఉన్న కారణంగా పర్యాటకులు ట్రెక్కింగ్ చేసుకోవడానికి కూడా అవకాశం ఉంటుందని చెప్పారు. జడ్చర్ల ప్రాంతం హైదరాబాద్ నగరానికి కేవలం 80 కి.మీ.ల దూరంలోనే ఉంటుందని, విమానాశ్రయం నుంచి కేవలం 40-50 నిమిషాల్లోనే ఉదండాపూర్ రిజర్వాయర్ వద్దకు చేరుకోవచ్చునని చెప్పారు. ఈ కారణంగా వారాంతపు దినాల్లో ప్రజలు ఇక్కడకు వచ్చి సెలవు రోజును గడపడానికి ఈ ప్రాంతం అనువుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సోమశిల తరహాలోనే ఉదండాపూర్ రిజర్వాయర్ లో నీళ్లు వచ్చిన తర్వాత టూరిజం బోట్లను కూడా ఏర్పాటు చేయాలని అనిరుధ్ రెడ్డి కోరారు. ఈ సౌకర్యాలు కలిగిస్తే ఉదండాపూర్ రిజర్వాయర్ ప్రాంతం కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని చెప్పారు. ఈ ప్రాంతంలో టూరిస్ట్ హోటల్ నుండి మంజూరు చేయాలని టూరిజం శఆఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. అలాగే 2002 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం హయాంలో పోలేపల్లిలో 25 ఎకరాల్లో లెదర్ పార్కును మంజూరు చేయడం జరిగిందని, ఈ లెదర్ పార్కును ప్రారంభించడానికి చర్యలు



తీసుకోవాలని కూడా అనిరుధ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాంతంలోని భూముల్లో ఫార్మా సెజ్ లో ఉన్న సుప్రీమ్, ఆమ్నెల్, శిల్పా అనే కంపెనీలకు చెందిన వారు చెత్తను భారీ స్థాయిలో డంప్ చేసి, రాత్రి వేళల్లో ఆ చెత్తను కాలుస్తున్నారని, దీని వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని ఫిర్యాదు చేసారు. అక్రమంగా అక్కడ చెత్తను డంప్ చేసి వాతావరణ కాలుష్యానికి కారణమౌతున్న ఈ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని తాను కాలుష్య నియంత్రణ మండలికి కూడా ఫిర్యాదు చేసానని చెప్పారు.

# అమరజీవి ధర్మబిక్షం జీవితం అంతా పేదల హక్కుల కోసం పోరాటం

**యాదగిరిగుట్ట, అక్షిత న్యూస్:**
యాదగిరిగుట్ట స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ పార్లమెంట్ సభ్యులు గీతా పని వారిలా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అమరజీవి బొమ్మగాని ధర్మబిక్షం 15వ వర్ధంతి పట్టణంలో గుండ్లపల్లి గౌడ సొసైటీలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన



యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరజీవి బొమ్మగాని ధర్మ బిక్షం తన జీవితం అంతా పేద ప్రజల హక్కుల కోసం వారి బాగుకోసం పోరాటం చేశారన్నారు. నిస్వార్థ జీవితంతో నిత్యం పేద ప్రజలకు వారి హక్కుల కోసం కృషి చేశారని మూడు సార్లు ఎమ్మెల్యేగా రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా పనిచేశారని అన్నారు.గీత వృత్తి లో ఉన్న కష్టాలను చూసి వారికోసం గీతా పనివాళుల సంఘం ఏర్పాటు చేసి అనేక పోరాటాలు చేసి గీతా కార్మికులకు పెన్షన్, తాడిచెట్టు పై నుండి కింద పడిన వరకి ప్రభుత్వం ఎక్సిగ్గేషియా చెల్లించడం, తాడిచెట్లు పెంచుకోవడానికి ప్రభుత్వం భూమిని ఇప్పించే విధంగా హక్కులను కల్పించిన గొప్ప నాయకుడు అన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్ళెం కృష్ణ, యువజన సమైక్య జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట మున్సిపల్ కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు మాజీ పేరబోయిన పెంటయ్య, సిపిఐ మండల కార్యదర్శి కల్లపేల్లి మహేందర్, గీతా పనివర్ల సంఘం నాయకులు గుండు వెంకటేష్, మాటూరు మల్లయ్య, గుండ్లపల్లి గౌడ సంఘం సభ్యులు ఎరుకల హేమేంధర్, దుశెట్టి చంద్రయ్య, కీసర బాలరాజు, సిపిఐ నాయకులు పేరబోయిన బంగారి, గోపగాని రాజు, గౌడ సంఘం నాయకులు గుండ్లపల్లి లింగం, అరె శ్రీధర్, పచ్చిమట్ల నరేష్, ఆరె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


# "అక్షయపాత్ర భోజన షెడ్డు" ప్రారంభోత్సవం

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద పేదలు, కార్మికులు మరియు ప్రయాణికుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన "అక్షయపాత్ర 5 రూపాయల భోజన షెడ్డు" ప్రారంభోత్సవం అత్యంత ఘనంగా జరిగింది.

మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ మారెపల్లి సురేందర్ రెడ్డి, మూడ చైర్మన్ లక్ష్మిణ యాదవ్ వివిధ కార్పొరేటర్లు కేంద్రాన్ని సందర్శించి, భోజన సౌకర్యాలను పరిశీలించారు. సామాన్యులకు సైతం నాణ్యమైన ఆహారం అతి తక్కువ ధరకే అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులతో కలిసి మేయర్ ప్రజలకు భోజనాన్ని వడ్డించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం పనిచేస్తుందని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు.





# నిరుపేద కుటుంబానికి అండగా ఒకటో వార్డు యువత

**రూ.20,000 ఆర్థిక సహాయం అందజేత**

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:**
రామకృష్ణాపూర్ పట్టణంలోని అల్లురి సీతారామరాజు నగర్, ఒకటో వార్డుకు చెందిన సుర చెన్నమల్లు గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన మరణంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న ఒకటో వార్డు యువత,స్థానిక ప్రజలు మానవత్వంతో ముందుకు వచ్చారు.ఈ సందర్భంగా యువత, వార్డు ప్రజలు కలిసి రూ. 20,000లను సేకరించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ సుర చెన్నమల్లు కుటుంబనికి ఇలాంటి సమయంలో కాలనీ వాసులు అందరరం వారికి అండగా నిలబడటం మన బాధ్యత అని అన్నారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశనవేణి సత్యనారాయణ, పోగుల మల్లయ్య, పిల్లి సతీష్, ముక్తి శ్రీనివాస్, మేకల కుమారస్వామి, భుక్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సహాయం అందించిన యువతకు, వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రియంబర్స్మెంట్ ఇయ్యాలి

**బిసి కమీషన్ చైర్మన్‌ని కలిసిన బీసీ నాయకులు**

**వరంగల్, అక్షిత బ్యూరో:**
బీసీ విద్యార్థులకు ఇచ్చే ఫీజు రియంబర్స్మెంట్ పై ఆంక్షలు ఎత్తివేసి పూర్తి ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాలని, తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన వర్గాలైన సంచార జాతుల సంక్షేమం కోసం సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వానికి సూచనలు



చేయాలని బీసీ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు బుట్టి శ్యామ్ యాదవ్ ధారబోయిన సతీష్ పులి శ్రీనివాస్ గౌడ్ లు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కి విజ్ఞాపన పత్రం అందజేసినారు. వరంగల్ పర్యటనలో భాగంగా బీసీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులను కలిసి బిసి ల సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామరెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రకటించిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

### కమిషన్ చైర్మన్ హామీ

ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ 50 కులాలను కమిషన్ సంచార జాతులుగా ప్రకటించిందని వారి సంక్షేమానికి బోర్డు లేదా కమిషన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వానికి సూచన చేస్తామని, బిసి విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ పై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు చెల్లించే విధంగా కమిషన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

## పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** విద్యార్థి దశ నుండి పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని అటవీ బీట్ అధికారులు రాజేష్ అన్నారు. బెండర ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు బొటానికల్ సందర్శనలో భాగంగా జిల్లా కేంద్రంలోని నర్సరీని అధ్యాపకుడు స్వామి ఆధ్వర్యంలో సందర్శించగా బీట్ అధికారులు కిషోర్, శ్రీవిద్య లతో కలిసి నర్సరీ



అవసరాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ జాతి మొక్కలను పెంచడం జరుగుతుందన్నారు. పర్యావరణంపై విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండాలన్నారు. నర్సరీ పెంపకంలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. జీవామృతం తయారీ విధానాన్ని విద్యార్థులకు తెలియజేయడంతో పాటు దాని ఉపయోగాలను క్లుప్తంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమీక్ష

### ఎంపీడీవో ఆంజనేయులు

**నాగర్ కర్నూల, అక్షిత ప్రతినిధి:** తాడూరు మండలంలోని చర్ల తిరు మలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లకు సంబం ధించిన లబ్ధిదారులతో సమీక్ష ఎంపీడీవో ఆంజనేయులు నిర్వహించడం జరిగింది. నిర్మాణములు త్వరగా పూర్తి చేయుటకు తగు సూచనలు చేయడం జరిగింది.మరియు లచ్చిరాం తండా గ్రామపంచాయతీలో,



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లా డడం మరియునర్సరీ విజిట్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మరియు ఎంపీ ఓ మరియు ఏపీవో,పంచాయతీ కార్యదర్శి మరియు హౌసింగ్ ఏఈ .సర్పంచి .పాల్గొనడం జరిగింది.

## ప్రజలకు అందుబాటులో నీటిని పెట్టడమే ప్రభుత్వ ధ్యేయం

### నీటి సమస్య ఉండకూడదని బోర్ వేయడం

### గ్రామ సర్పంచి మంగమ్మ రతన్ సింగ్

**చ్చంపేట, అక్షిత ప్రతినిధి:** అచ్చంపేట నియోజకవర్గంలోని దేవదారికుంట గ్రామపంచాయతీలో ఒకటి రెండు వార్డుల్లో నీళ్ల కోసం గ్రామ సర్పంచి మంగమ్మ రతన్ సింగ్. ఆధ్వర్యంలో రాబోయే వేసవి



కాలం దృష్టిలో పెట్టుకొని గ్రామంలో ఎక్కడ కూడా నీటి సమస్య ఉండకూడదని బోర్ వేయడం జరిగింది. ఇట్టి బోరుకు మోటార్ బిగించి ప్రజలకు నీటిని సరపర చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపైనే ట్రాన్స్‌ఫార్మర్

# ప్రజల ప్రాణాలకు ముప్పు!

### రోడ్డుపైనే అదనపు నిర్మాణాలపై పలు అనుమానాలు

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**సంగారెడ్డి, అక్షిత బ్యూరో :**
సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నేరుగా ప్రధాన రహదారిపైనే ఏర్పాటు చేయడం తీవ్ర వివాదానికి దారి తీసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం కోసం ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిబంధనలను పూర్తిగా విస్మరించి రోడ్డు పైనే నిర్మాణం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. ప్రజల భద్రతను పక్కనబెట్టి, భవన యజమానుల స్వలాభం కోసం రోడ్డు నే ఆక్రమించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రద్దీ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఎలా మంజూర య్యాయన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మున్సిపల్, విద్యుత్



శాఖల అధికారులు దీనిపై స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో కొంతమంది ప్రముఖుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు తక్షణమే స్పందించి, రహదారిపై ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను, ఇనుప మెట్లు, ప్రస్తుతము రోడ్డు పైన నిర్మిస్తున్న అదనపు పిల్లర్లను తక్షణమే తొలగించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కేజీబీవీ బాలికల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

### నాగర్ కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**
నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ జీవి శ్యామ్ ప్రసాద్ లాల్ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాల యాన్ని డిఇఓ రమేష్ కుమార్,జిసిడిఓ శోభా రాణిలతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వంటగది మరియు ఆహార పదార్థాల నిల్వ గదిని పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెస్ కమిటీ విద్యార్థులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, పాఠశాలకు సరుకులు వచ్చిన ప్రతిసారీ రిజిస్టర్లలో మెస్ కమిటీ విద్యార్థులు సంతకం చేయాలని సూచించారు. విద్యా ర్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే ఆహార పదార్థాల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలిం చాలని సూచించారు. విద్యార్థులతో కలిసి



సహపంక్తి భోజనం చేశారు.

అనంతరం ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి, బాగా సిద్ధమై పరీక్షలను మంచిగా రాయాలని ప్రోత్సహించారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, పరీక్షలు అంటే భయపడ కాకూడదని సూచించారు. పీఎం శ్రీ పథకం కింద పాఠశాలలో చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్, పాఠశాలకు అవసరమైన అంశాలపై వెంటనే ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు.

బాలికల సంరక్షణ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్త హీనతతో బాధపడే విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించేం దుకు ఏఎన్ఎంలు ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించ కుంటే రక్తహీనతకు గురవుతారని, అందుకు ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన ఆదేశించారు. ఆయన వెంట డిఇఓ రమేష్ కుమార్, జి సి డి ఓ శోభారాణి, ఎంపీడీవో ఇతర మండల స్థాయి అధికారులు ఉన్నారు.

## సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ సిపి

### న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి

### వరంగల్ సిపి

**వరంగల్, అక్షిత ప్రతినిధి:** వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్ ప్రీత్ సింగ్ గురువారం సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సంగెం అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలకగా, ముందుగా సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. అనంతరం సీపీ పోలీస్ స్టేషన్‌ను సమగ్రంగా పరిశీలించిన కమిషనర్, స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ప్రజల జీవన విధానం, స్థానికంగా జరుగుతున్న నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులపై వివరాలను ఇన్స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ సిబ్బంది పనితీరు, బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

అనంతరం స్టేషన్‌లో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన అంశాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పనిచేయాలని సూచించారు. ఫిర్యాదులపై వెంటనే



స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వం లేకుండా, పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీసులు తమ విధులను నిర్వర్తించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామూనూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సిఐ రాజగోపాల్, సంగెం ఎస్. ఎస్. ఐ వంశీ కృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని కాపాడండి.. దేశాన్ని రక్షించండి

**-అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ (ఏఐకేఎంఎస్)కేంద్ర కార్యనిర్వాహకవర్గం**

**-వేములపల్లి వెంకట్రామయ్య ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు**

**కామ్రేడ్ ఆశిష్ మిట్టల్ జాతీయ ప్రధాన కార్యదర్శి**

**రబీందర్ సింగ్ పాటియాలా జాతీయ నాయకులు**

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ఖమ్మంలో అఖిల భారత రైతు కూలీ సంఘం(ఎఐకెఎంఎస్) జాతీయ కమిటీ విలేకరుల సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్ష కార్యదర్శులు వేములపల్లి వెంకట్రామయ్య అశీష్ మిట్టల్ జాతీయ నాయకులు రబీందర్ సింగ్ పాటియాలా(పంజాబ్) పాల్గొని మాట్లాడారు. అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) కేంద్ర కార్యనిర్వాహకవర్గ సమావేశం మార్చి 25, 26 రెండు రోజులు ఖమ్మంలో జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయాన్ని కాపాడండి దేశాన్ని రక్షించండి అనే నినాదంతో వ్యవసాయక విప్లవానికి ప్రజల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు నెలలో ఖమ్మంలో జరుగు అఖిలభారత రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విదేశీ సంస్థలతో సహా కార్పొరేట్ లాభాలను పెంచుకోవడానికి రైతాంగాన్ని వారి జీవనాధారాలను కేవలం అనుబంధాలుగా వనరులుగా మార్చి బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీవ్రతరం చేస్తున్న దాడులపై ఈ సమావేశంలో సవివరంగా చర్చించడం జరిగింది.




జాతీయ ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకువస్తున్న వీబీ రామ్ జీ చట్టాన్ని కేంద్ర కార్యవర్గం తీవ్రంగా వ్యతిరేకించి తీర్మానాలను ఆమోదించింది. గ్రామ సభలు ఉద్యోగాలను నిర్ణయించి కేంద్రం చెల్లింపులు చేసే పాత డిమాండ్ ఆధారిత చట్టానికి భిన్నంగా ఈ కొత్త పథకం ఎటువంటి ప్రభావవంతమైన హామీ లేకుండా సరఫరా ఆధారిత ఉపాధి పథకంగా దీనిని అభివర్ణించింది. జల్ జీవన్ పథకాలు కోల్డ్ స్టోరేజీల నిర్మాణం వంటి కార్పొరేట్ సంస్థలకు ఆసక్తి ఉన్న గ్రామీణ పనులతో సహా వి బి రామ్ జీ పథకం కేంద్ర పనుల కేటాయింపుపై ఆధారపడి ఉంటుంది. ఇది గత ఉపాధి హామీ పథకానికి అనుగుణంగా వేతనాలను ఉంచింది, అవి మార్కెట్ రేట్లలో సగం కంటే తక్కువగా ఉన్నాయి. ఇది 125 రోజుల గ్యారెంటీ ఇస్తున్నట్లు చెబుతోంది. కానీ అది రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. ఇది కేంద్ర కేటాయింపులను కూడా గతంలోని 90% నుండి 60%కి తగ్గించింది.

డిసెంబర్ 9, 2021న ఎస్‌కేఎం కు ఇచ్చిన హామీకి అనుగుణంగా కొత్త విద్యుత్ బిల్లు 2025 ను ఉప సంహరించుకోవాలని సీఈసీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది. ఈ బిల్లు అన్ని క్రాస్ సబ్సిడీలను రద్దు చేసి నిరుపేద వర్గాలను పూర్తి వాణిజ్య ధరలకు గురిచేస్తున్నది. అంతేకాకుండా స్మార్ట్ ప్రీ-పెయిడ్ మీటర్లను కూడా పెడతారు.దీనిని రైతాంగం వ్యతిరేకిస్తోంది. వినియోగదారులందరికీ 300 యూనిట్ల ఉచిత విద్యుత్ మంజూరు చేయాలని సాగునీటికి ఉచిత విద్యుత్ అందించాలని ధనికుల నుండి నష్టాలను వసూలు చేయాలని ఏఐకేఎంఎస్ డిమాండ్ చేసింది. విద్యుత్ అనేది మానవునికి అత్యవసరం. కంపెనీల లాభాపేక్ష కోసం వారిని చీకట్లోకి నెట్టలేరు.

ఈ సమావేశం కొత్త విత్తన బిల్లు 2025 ను కూడా వ్యతిరేకించింది. ఈ బిల్లు హానికరమైన జీఎం విత్తనాలతో సహా పరీక్షించని విదేశీ విత్తనాలు ఉచిత దిగుమతులను అనుమతిస్తుందని విత్తనాలను స్వేచ్ఛగా అనుమతిస్తుందనీ


బ్లాక్ మార్కెటింగ్‌పై ఉన్న నిషేధాన్ని తొలగిస్తుందని వివరించింది. ప్రపంచ విత్తన మార్కెట్‌లో 90 శాతాన్ని కేవలం 6 ప్రధాన విత్తన కంపెనీలు నియంత్రిస్తున్నాయి. భారతదేశ విత్తన సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలు అత్యంత ప్రమాదకరమైనవి.

మోదీ ప్రభుత్వం ట్రంప్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద అవగాహన మరియు ఆ ఒప్పందాన్ని రైతు అనుకూలమైనదిగా చూపించే ప్రయత్నం అమెరికా ప్రయోజనాల ముందు మోదీ ప్రభుత్వం దాసోహం అవుతోందని స్పష్టం చేస్తున్నాయని ఇది భారత వ్యవసాయ స్వయం అభివృద్ధిని నిలుపుకోవడాన్ని దెబ్బతీస్తుందని సీఈసీ కూడా భావించింది. సోయాబీన్ మొక్కజొన్న, పత్తి ఇథనాల్ డిస్టిల్డ్ డ్రైడ్ కొడి మాంసం పాలు పాల ఉత్పత్తులు ఆపిల్స్‌తో సహా పండ్లు మరియు ఇతర వస్తువుల ఎగుమతులను విస్తరించడానికి ట్రంప్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న తరుణంలో దిగుమతి సుంకాలను సగటున 37% నుండి సున్నాకు తగ్గించడం మరియు గతంలో ఉన్న 2.5%కి బదులుగా 18% ఎగుమతి సుంకాన్ని విధించడాన్ని ఆమోదించారు.అన్ని పంటలకు కనీస మద్దతు ధర రుణమాఫీ సమస్యలపై పెండింగ్‌లో ఉన్న పోరాట డిమాండ్లతో పాటు ఈ విధాన మార్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న విధానాలపై అఖిల భారత ఉద్యమాన్ని కూడా విస్తరిస్తామని సీఈసీ. విశ్వాసాన్ని ప్రకటిస్తున్నది. ఈ చర్య సంయుక్త కిసాన్ మోర్చా లోని ఇతర శక్తుల సమన్వయంతో తీసుకోబడినది. భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం దాదాపు రూ. 2 లక్షల కోట్ల విలువైన కార్పొరేట్ రుణాలను మాఫీ చేస్తూ రైతులను అధిక మరియు పెరుగుతున్న ధరలకు గురిచేస్తోంది. దీనికి తోడు బీజేపీ నాయకుడు మోదీ వాగ్దానం చేసిన మరియు వారు ఎన్నికలు నిర్వహించే రాష్ట్రాలలో బోనస్‌గా అమలు చేసే ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ ఫార్ములా ప్రకారం కొనుగోళ్లకు హామీ కూడా ఇవ్వడం లేదు.భారీ స్థాయిలో భూసేకరణ వ్యవసాయ భూమిని వ్యవసాయేతర ప్రయోజనాలకు మళ్లించడం వంటి అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తీవ్రంగా పరిగణించింది. కరోనా సమయంలో స్పష్టమైనట్లుగా భారతదేశంలోని ప్రజల మనుగడకు వ్యవసాయమే అతిపెద్ద రక్షణగాకవచంగావుంది.

ప్రపంచ పోలీసుగా వివరిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాదం ట్రంప్ ఆధ్వర్యాన యూదు దురహంకార ఇజ్రాయిల్ నేతన్యాహూ కలసి ఇరాన్ పై సాగిస్తున్న అత్యంత దుర్మార్గమైన యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తున్నది. యుద్ధం వల్ల ఇప్పటికే భారత వ్యవసాయ రంగంతో సహా దేశంలోను ప్రపంచంలోను ఆర్థిక వ్యవస్థలు ధరలు పెరిగి అతలాకుతలం అవుతున్నాయి. ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి మన సరిహద్దుల వరకు వచ్చిన అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధాన్ని ఖండించి ఆపాలని కోరుతూ ప్రకటనలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం.

ఖమ్మం పట్టణంలో భూదాన్ భూమిలో ఇండ్లు నిర్మించుకొని గత పది సంవత్సరాలకు పైగా నివాసం ఉంటున్న వారిపై బుల్డోజర్లను పంపి వారి ఇళ్ళను నేరమట్టం చేయటాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ చర్య చట్ట వ్యతిరేకమని హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వులు కూడా రుజువు చేస్తున్నాయి. రాష్ట్రంలోని పేదల పంపిణీ కోసం నిర్దేశించిన భూదాన భూములను అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలుగా కానీ వ్యవసాయ భూములుగా కానీ వెంటనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

ఈ ఉద్యమానికి అలాగే కార్పొరేట్ ఆక్రమణల నుండి తమ భూములను అటవీ సంపదను కాపాడుకోవడానికి గిరిజనులు మరియు ఇతర అటవీ నివాసులు చేస్తున్న పోరాటాలకు బలమైన ఊపునివ్వడానికి అటవీ హక్కుల చట్టం పర్యావరణ, అటవీ భద్రతా చట్టం లను సక్రమంగా అమలు చేయడానికి మరియు గిరిజనలు రైతులపై జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా బలమైన అఖిలభారత పోరాటాన్ని నిర్మించడానికి వ్యవసాయాన్ని కాపాడండి దేశాన్ని రక్షించండి అనే కేంద్ర నినాదంతో 2026 సెప్టెంబర్ 28 29 మరియు 30 తేదీలలో ఖమ్మంలో జరగనున్న తన నాలుగవ అఖిలభారత మహాసభ కోసం సన్నాహాలను ప్రారంభించాలని సి ఈ సి నిర్ణయించింది. ఈ సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సుశాంత్ ఝూ(పశ్చిమ బెంగాల్) రాంబిక్స్ (బీహార్) నిర్భయ సింగ్ (పంజాబ్) బాలచంద్ర సడంగి (ఒరిస్సా) దుర్గాప్రసాద్ (ఆంధ్రప్రదేశ్) జితేందర్ సింగ్ (పంజాబ్), హీరాలాల్ (ఉత్తరప్రదేశ్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రదేశ్), వి కోటేశ్వరరావు (తెలంగాణ)ఎం బిక్షపతి (తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు), మండల వెంకన్న (తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) ధరంపాల్ సింగ్ (ఉత్తరప్రదేశ్)శంభు ప్రసాద్ (బీహార్) ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బజ్జూరి వెంకట్రామిరెడ్డి వై ప్రకాష్ పాల్గొన్నారు.



## నూతన పంచాయతీ కార్యదర్శిని సన్మానించిన గ్రామ సర్పంచ్ శంకర్

**అచ్చంపేట అక్షిత ప్రతినిధి:** అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలం పద్మనపల్లి గ్రామానికి నూతనంగా వచ్చిన గ్రామ కార్యదర్శి జమల్‌కి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ దేవి వెంకటరామ్ .వార్డు మెంబర్ చందు. చిత్ర సేనా రెడ్డి . మహేష్ రాజు .శంకర్ .దేవుడు శ్రీకాంత్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## జినుకుంట గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం

**- గ్రామ సర్పంచి రంగినేని పుష్పలత**

**అచ్చంపేట, అక్షిత ప్రతినిధి:** అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలం పరిధిలో జినుకుంట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సర్పంచి రంగినేని పుష్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు కూడా ఉపాధి హామీ పనికి వెళ్లాలని సూచించారు. ఉపాధి పథకం ద్వారా రైతులు వ్యవసాయ పొలాలలో చదురు చేసుకోవడం పిచ్చి మొక్కలను తొలగించడం. డొక్కలు బాటలు వేసుకోవడం. కట్టలు వేసుకోవడం. గ్రామంలో చెరువు కుంట్ల దగ్గర శుభ్రం చేసుకోవడం.



తదితర పనులు ఉన్నాయని అన్నారు. అదే విధంగా ప్రతి ఇంటి దగ్గర ఇప్పుడు గుంతలు మారుగుదొడ్లు ఏర్పాటు చేసుకోవడానికి ఉపాధి పథకం ద్వారా డబ్బులు ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిరంజన్. గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## పేదింటి ఆడబిడ్డ విద్యకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పాఠశాల ఫీజు అందజేత

**కల్వకుర్తి,అక్షిత న్యూస్:** కల్వకుర్తి మండలం,తోటపల్లి గ్రామానికి చెందిన జోగు ప్రణీత 5వ తరగతి,తండ్రి జోగు బంగారయ్య ప్రమాదవశాత్తు



మరణించారు. వారి యొక్క పిల్లలు విద్యకు దూరమవుతున్నారని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్న దృష్టికి తీసుకు వెళ్లగా ప్రణతి పూర్తి చదువు బాధ్యతను తాను తీసుకుంటానని గత సంవత్సరం ఇచ్చిన మాట ప్రకారం గురువారం నోబెల్ పాఠశాల,కల్వకుర్తిలో ఈ విద్యా సంవత్సరం 5వ తరగతి ఫీజుని చెల్లించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోగు రమణమ్మ సత్యనారాయణ, ఉప సర్పంచ్ కంపిల్లా భీమయ్య,ఉప్పల వెంకటేష్ అన్న సైన్యం దారమోని గణేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలీం తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

**- మహాదేవుని శ్రీనివాస్**



కొమురవెల్లి, అక్షిత న్యూస్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు సిద్దిపేట జిల్లా లింగ బలిజ సంఘం అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముడు ధర్మం, సత్యం, న్యాయం, సేవాభావానికి ప్రతీక అని, ఆయన చూపిన ధర్మమార్గం మన జీవితాలకు మార్గదర్శకం అని,ఈ పవిత్రమైన రోజున మనమంతా సత్యం, నీతి, పరస్పర గౌరవం అనే విలువలను పాటిస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.శ్రీ సీతారాముల దివ్య ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని, సిద్దిపేట జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

## రవాణా శాఖ సమీక్షాలో పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే

గద్వాల, అక్షిత న్యూస్:

హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్లో రాష్ట్ర రావాణ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలొ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొని గద్వాల నియోజక వర్గంలోని రవాణా వ్యవస్థకు సంబందించిన వినతిపత్రం అందజేసి సమస్యలను మంత్రికి వివరించడం జరిగింది దీనికి గాను మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.

గద్వాల ఎమ్మెల్యే మంత్రివర్యులకు సమస్యలు వివరిస్తూ గద్వాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఆర్ టి సి రవాణా సౌకర్యాలు మెరుగు పర్చాలని, ప్రతి గ్రామానికి బస్టాండ్ లను నిర్మించి ప్రాథమిక సౌకర్యాలు ఏర్పార్చాలని, రాష్టంలో కొత్తగా వచ్చే ఎలక్ట్రికల్ బస్సులను అధిక మొత్తంలో కేటాయించాలని, గద్వాలలొ నూతన ఎలక్ట్రికల్



వాహనాల ఛార్జింగ్ స్టేషన్ నిర్మించాలని, గద్వాల బస్టాండ్ లొ అన్ని మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకీ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలొ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి జూపల్లి కృష్ణారావు మంత్రి సీతక్క మంత్రి వివేక్ వెంకటస్వామి మేనేజింగ్ డైరెక్టర్ ఆర్టిసి మరియు ప్రిన్సిపల్ సెక్రటరీ రవాణా ఐఏఎస్ వికాస్ రాజు మరియు ఇతర రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో అరైవ్ అలైవ్

యాదగిరిగుట్ట అక్షిత న్యూస్: రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతాయని యాదగిరిగుట్ట డి.ఎస్.పి శ్రీనివాస్ నాయుడు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట బస్టాండ్ నందు అరైవ్ అలైవ్ ప్రోగ్రాం లో భాగంగా స్థానిక బస్టాండ్ నందు ఓవర్ టేకింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలు రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు గురించి




డి.ఎస్.పిశ్రీనివాస్ నాయుడు ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ప్రయాణం చేసేటప్పుడు ఫోర్ వీలర్‌లో ప్రయాణం చేసేవారు తప్పని సరిగా సీటు బెల్టు ధరించాలని టూవీలర్ ప్రయాణం చేసేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎలగొండ కృష్ణ, ఎస్సైలు దేవేందర్, సైదులు, కృష్ణస్వామి, రూప శ్రీ కానిస్టేబుల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి డిపో ఎదుట సీఐటీయూ ధర్నా

**డి.ఏం.గురజాలకు వినతి**

**విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసీలకే అప్పగించాలి**

**ఆర్టీసీ సంస్థను బలోపేతం చేయాలి**

**కార్మికుల సమస్యల పరిష్కరించాలి.**

**వేతన సవరణ అమలు చేయాలి.**

**పెండింగ్ వేతనాలు చెల్లించాలి.**

**ఆర్టీసీ యూనియన్ లపై ఆంక్షలు ఎత్తివేయాలి.**






సత్తుపల్లి, అక్షిత న్యూస్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యుత్ బస్సుల విధానంతో తెలంగాణ ఆర్టీసీ సంస్థ రక్షణ,కార్మికుల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని,కార్పోరేట్ సంస్థలు ఆర్టీసీలో విద్యుత్ బస్సుల నిర్వహణను చేయడం సహేతుకం కాదని వెంటనే విద్యుత్ బస్సుల నిర్వహణ ను ఆర్టీసీ కి అప్పగించాలని సిఐటియు ఖమ్మంజిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్,జిల్లా కమిటి సభ్యులు కొలికపోగు సర్వేశ్వరావు లు డిమాండ్ చేశారు.గురువారం సిఐటియు రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఆర్టీసీ సత్తుపల్లి బస్ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో డి.ఏం. కార్యాలయం ప్రధాన గేటు ఎదుట ధర్నా చేశారు.అనంతరం సమస్యలతో కూడినవినతిపత్రాన్ని డి.ఏం.గురజాల లక్ష్మీ నారాయణ కు ఇచ్చారు. ధర్నాలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా నేత శీలం సత్యనారాయణరెడ్డి ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టం-2019 మరియు విద్యుత్ బస్సుల విధానంతో ఆర్టీసీల రక్షణ కార్మికుల ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందన్నారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకంతో ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెరుగుతుందని తద్వారా సంస్థ విస్తరించి ఉద్యోగ నియామకాలు జరుగుతాయనిఆశించామన్నారు.అందుకు భిన్నంగా కార్పోరేట్ సంస్థలకు విద్యుత్ బస్సుల నిర్వహణ అప్పజెప్తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన ఆందోళనవ్యక్తంచేశారు.సమర్థవంతంగా ప్రయాణికులకు ప్రయాణ సేవలు అందిస్తున్న ఆర్టీసీ సంస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు విద్యుత్ బస్సుల నిర్వహణ అప్పగించడమేంటని ఆయన ప్రశ్నించారు.వెంటనే విద్యుత్ బస్సుల విధానంలో అవసరమైన మార్పులు చేసి విద్యుత్ బస్సుల కొనుగోలు,నిర్వహణ,ఆపరేషన్ అన్నీ ఆర్టీసీ సంస్థ నిర్వహించేటట్లు చర్యలుతీసుకోవాలన్నారు.విద్యుత్ బస్సుల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వాలు ఆర్టీసీలకు నిధులు సమకూర్చాలన్నారు.బస్సుల నిర్వహణ ఖర్చు,ఆదాయం కు మధ్య ఉండే వయబులిటీ గ్యాప్ ఫండ్ ను ప్రభుత్వం ఆర్టీసీకి సమకూర్చాలన్నారు.ఆర్టీసీ కార్మికులకు 2021 మరియు 2025 వేతన సవరణలను వెంటనే అమలు చేయాలని, 2017 వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగభద్రత, భరోసా కల్పించాలని,ఆర్టీసీ కార్మికుల సమస్యలుపరిష్కరించాలని, ఆర్టీసీలో యూనియన్లపై ఉన్నఆంక్షలను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్ లవిధానంలో మార్పుచేయాలని,జిసిసి పద్ధతిని రద్దు చేయాలని,ప్రైవేటు సంస్థలకు ఇస్తున్న అన్ని సబ్సిడీలను ఆర్టీసిలకు ఇవ్వాలని,ఆర్టీసి లే నేరుగా విద్యుత్ బస్ లుసమకూర్చుకొనేందుకు అవకాశం ఇవ్వాలని, అందుకోసం ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించాలని,ఆర్టిసి బస్ ల ఆపరేషన్ ఖర్చుకు,ఆదాయానికి మధ్య వ్యత్యాసాన్ని (వయబిలిటీ గ్యాప్ ఫండ్)ను ఆర్టీసికి ఇవ్వాలని,విద్యుత్ బస్ బాడీ ఫ్యాబ్రికేషన్ ఆర్టీసి వర్క్ షాప్‌లలో చేయించాలని,అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని, ప్రజల అవసరాల మేరకు ఆర్టీసీ బస్‌ల సంఖ్యను పెంచాలని, పిఎమ్ఇ డ్రైవ్ పథకంలో ఇస్తున్న సబ్సిడీని ఆర్టీసి చేసే 'రెట్రో ఫిట్మెంటు' బస్ లకు కూడా వర్తింప చేయాలని, ఆర్టీసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని.ఆర్టీసీ పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారం,సంస్థ బలోపేతం కోసం ప్రభుత్వం, యాజమాన్యం సరైన ఆలోచన చేయకపోతే ప్రజలను సమీకరించి మరిన్ని ఆందోళన నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు సభ్యులు చప్పిడి భాస్కర్,దాసు,ఐద్వా రాష్ట్ర కమిటి సభ్యురాలు శీలం కరుణ తదితరులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కరపత్రం విడుదల

**బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి**

**పల్లగొర్ల మోదీరాందేవ్**

యాదాద్రి భువనగిరి అక్షిత న్యూస్: ఓబీసీ సమస్యల పైన మార్చి 30,31న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చౌటుప్పల్ బస్టాండ్ వద్ద ఉన్న సాకలి ఐలమ్మ విగ్రహం వద్ద కరపత్రం విడుదల చేసి అభివాదం చేశారు ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకులు, బిసి విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ వారు మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ ఆధ్వర్యంలోలి బీసీ సమస్యల పరిష్కారం కోసం జాతీయ సెమినార్,జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే ఎస్సీ ఎస్టిబీసీ



జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జన గణనలో కుల గణన చేయాలని,దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలని సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తులలో ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గవర్నమెంట్ సంస్థలో ప్రైవేటీకరణ నిషేధించాలని బీసీ క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింపజేయాలని బీసీలంట్లే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగనే చూస్తున్నారు ఉద్యోగాలలో బీసీలు 7 శాతం గిట్ల లేకపోవడం సిగ్గుచేటు రాజకీయంగా 12 శాతం దాటలేదు బీసీలు, రాష్ట్ర ప్రభుత్వం ఏమో బీసీలకు స్థానిక సంస్థల 42% రిజర్వేషన్ అని చెప్పి దాన్ని అమలు చేయకుండా తుంగలోకి తొక్కింది బడ్జెట్లో బీసీలకు తీవ్ర అన్యాయం చేసింది రాష్ట్ర ప్రభుత్వం మొన్న పెట్టిన బడ్జెట్లో 62% శాతం ఉన్న బీసీలకు 3 శాతం నిధులు కేటాయించడం దుర్మార్గం గత బడ్జెట్లో పదివేల కోట్ల నిధులు కేటాయిస్తే ఖర్చు చేసింది కేవలం 1800 కోట్లు బీసీల అంటే ఈ ప్రభుత్వానికి దున్నపోతు మీద వర్షం కురిసినట్లు ఉంది,బీసీల సత్తా ఐక్యతను రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వం చూస్తాదని హెచ్చరించారు కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయాలి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని సంక్షేమాష్టలకు సొంత భవనాలు నిర్మించాలని మెస్చార్జులు 3,000లకు పెంచాలని ,,, రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి తీరా ఎలక్షన్ల టైం లో బీసీ బిల్లుకు గోవింద కొట్టింది రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల పైన ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న పార్లమెంటులో ప్రవేట్ బీసీ బిల్ పెట్టాలని డిమాండ్ చేశారు ఈ రాష్ట్ర ప్రభుత్వం చదువుకుందాం అంటే స్కాలర్షిప్ లు ఇవ్వదు రాజకీయంగా వద్దామంటే రిజర్వేషన్లు ఇవ్వదు ఎంతసేపటికి కమిషన్ వచ్చే దానికి మూటల అప్పజెప్పే పథకాలకు మాత్రమే ఈ రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతుంది బీసీలకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో ఒక మిలిటెంట్ శక్తిగా ఏర్పడి ఉద్యమిస్తామని హెచ్చరించారు సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజిక వేత ఉద్యమకారుడు బెల్లి చంద్రశేఖర్, బీసీ యువజన సంఘం ఉమ్మడిజిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకల శ్రీనివాస్,దాసరి లవ్లేష్, దాసరి శ్రీనివాస్, గోగు లింగం, బెల్లి మధుకర్,మహేష్, నరారి మల్లేష్, వీరయ్య, సైదుల్ గౌడ్, విగ్నేష్, సత్తయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన పేరుకేనా..?

### క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారం చేయరా

### ఎమ్మెల్యే,మేయర్, కార్పొరేటర్‌లు చొరవ చూపరా

### రాజకీయ అవసరాలే అభివృద్ధికి తార్కాణమా గత 20 ఏండ్ల నుండి ఆవేదనలో సోమిడి



**వరంగల్, అక్షిత బ్యూరో:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోనే ఉన్న 62 వ డివిజన్ సోమిడి ప్రాంతానికి చెందిన గౌరీ శంకర్ ఇంటి పక్కన గల్లి గత 25 సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోక చిన్న చినుకు వస్తే చాలు కాజీపేట నుండి సోమిడి కుంట మీదుగా వెళ్లే డ్రైనేజీ నీరంతా ఈ రోడ్డు వంపుగా ఉండటం వల్ల ఈ గల్లీ మొత్తం పూర్తి నీటి గుంటగా మారుతుంది.

#### ఏండ్లుగా ఆవేదన

గత 20 సంవత్సరాల నుంచి కార్పొరేషన్ లో ఉన్న కార్పొరేటర్లు మొదట కుమ్మరి శాంతమ్మ, సుంచు అశోక్, పదేళ్ల క్రితం జక్కుల రమ, ప్రస్తుతం కూడా జక్కుల రవీందర్ యాదవ్ కార్పొరేటర్లుగా కొనసాగుతున్నారు.

#### ఇంత నిర్లక్ష్యం

రాజకీయ కారణాలు లేదా గతంలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ లేకపోవడం వల్ల కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ వారు కావడం వల్ల పనులు కాలేదని చెబుతూ వచ్చారు. కానీ ప్రస్తుతం ఉన్న కార్పోరేటర్ గతంలో ఇప్పుడు కూడా వారే కార్పొరేటర్ గా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి గానే కొనసాగుతున్నప్పటికీ గతంలో ఉన్న మేయర్లు గాని ప్రస్తుత మేయర్ గుండు సుధారాణి,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అందరూ కాంగ్రెస్ పార్టీ వారే కావడం ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు దాటినా కూడా ఇక్కడ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

#### పట్టించుకోరా జవాను సార్లు

ఈ గల్లీకి ఒక పారిశుధ్య కార్మికుడు రాడు, వీధి దీపాలు పర్యవేక్షించేవారు ఉండరు, కనీసం రోడ్లు శుభ్రం చేసేవారు రారు, ఈ గల్లీలో కనీసం నగరపాలక సంస్థ పరిధిలోనే ఉన్నదా లేదా మారుమూల ప్రాంతంలో ఉండి ఉన్నదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్లపైకి నిర్మాణాలు వచ్చిన పట్టించుకునే నాధుడు ఉండడు నోరులేని వాళ్ళు మాత్రం ఇంటి పన్ను ఆలస్యం అయితే ఆస్తులు కబ్జా చేసే నగరపాలక సంస్థ ఈ గల్లీలోని రోడ్డు ఇంత ఇరుకుగా ఉన్న ఎందుకు దృష్టి సారించడం లేదు రోడ్డు మాస్టర్ ప్లాన్ ప్రకారం ఎంత ఉండాలి ప్రస్తుతం ఇంక్రోచ్మెంట్ ఎంత ఉన్నది దీనిని ఎప్పటికప్పుడు పరిశీలించవలసిన పట్టణ ప్రణాళిక విభాగం ఎందుకో మరిచి పోయినట్లున్నది.

#### ఇరుకైన రోడ్డు

ఒక టూ వీలర్ పార్కింగ్ చేస్తే మరో టూవీలర్ వచ్చే పరిస్థితి లేదు. దీనిని చూసి చూడనట్లు వదిలేస్తున్న స్థానిక పాలకులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా గత 20 సంవత్సరాలుగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వర్షాలు వచ్చినప్పుడు మాత్రమే ఇటువైపు చూస్తూ ఎన్నికల ప్రమాణాల్లో ఈసారి తప్పకుండా చేస్తామని గత 20 ఏళ్లుగా చెబుతూనే ఉన్నప్పటికీ ప్రస్తుత పాలకమండలి మరో రెండు మాసాల్లో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్ ఈ గల్లీలో ఉన్న రోడ్డు డ్రైనేజీ చక్కదిద్దుతారా లేదా అనే అనుమానాలు కార్పొరేటర్ ను నేరుగా వెళ్లి ప్రశ్నించే స్థాయిలో లేని గల్లీ ప్రజలు మీడియా ద్వారా వేడుకుంటున్నారు.

#### రాజకీయాలే కారణమా అమాయకులు బలికావాల్సిందేనా

గతంలో ఈ గల్లీలో బారాస పార్టీకి చెందినవారు ఉండేవారెమో అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయడం లేదేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ ఎవరూ ఓట్లు వేయకుండానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందా అని ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని గల్లీ ప్రజలు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్ ఈ గల్లీ సమస్యలు పరిష్కారం చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి పరిష్కారం చేస్తారని స్థానిక గల్లి ప్రజలు కోరుతున్నారు.

#### సేవలో పూర్తి నిర్లక్ష్యం

మరి ముఖ్యంగా 25-4-730 ఇల్లు చాలా చిన్నగా ఉండడం గత 20 సంవత్సరాల క్రింద కట్టిన ఇల్లు కావడం వల్ల అప్పటి అంచనాలకు సక్రమంగానే ఉన్నప్పటికీ మారిన పరిస్థితుల కారణంగా ప్రధాన రోడ్డు పెద్దగా వేయడం ఈ గల్లీ రోడ్డు చిన్నగా వేయడం ఇప్పుడు ఇండ్లు కట్టుకునేవారు చాలా ఎత్తుగా చేసుకోవడం వల్ల ఈ ప్రాంత డ్రైనేజీ పూర్తిగా మురుగునీటితో నిండిపోవడం కనీసం వాటిని ఆరు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయని పారిశుధ్య సిబ్బంది కారణంగా ఎప్పుడు ఈ డ్రైనేజీ నిండు గానే ఉంటుంది దీని కారణంగా చిన్న వర్షం పడిన గల్లి అంతా మురికి నీటితో నిండి వంపుగా ఉన్న ఇళ్లలోకి నీరు చేరి కప్పలు పాములు తేళ్లు జనాలతోనే సావాసం చేస్తున్నాయి.

#### ప్రజా పాలనకు నిర్వచనం క్షేత్రస్థాయిలో అమలు జరగాలి

ఇప్పటికైనా పాలకమండలి రెండు మాసాల్లే ఉన్న నేపథ్యంలో ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తనకు ప్రజలందరూ సమానమేనని రాజకీయ పార్టీలతో సంబంధం లేదని అభివృద్ధి పరచడంలో అందరినీ కలుపుకుపోయే ప్రజా ప్రభుత్వము అని చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధి స్పందించి ఈ సమస్యపై పరిష్కారం చూపాలని ప్రజలు వేడుకుంటున్నారు. పాలనలో క్షేత్రస్థాయి నుంచి కార్పొరేటర్ రాజ్యసభ సభ్యురాలు మేయర్ గా అపార అనుభవం ఉన్న ప్రస్తుత మేయర్ గుండు సుధారాణి ఈ గల్లీ సమస్యను పరిష్కారం చేసేందుకు ప్రత్యేక చొరవ చూపుతారని రోడ్లెక్కి ధర్నాలు చేయలేక కార్పొరేటర్ ను ప్రశ్నించలేక గత 20 ఏళ్లుగా వెతలు అనుభవిస్తున్న గల్లీ ప్రజలు కోరుతున్నారు.

#### రాజకీయాలకతీతంగా ప్రజా పాలన సాగాలి

కార్పొరేటర్ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసి రెండు పర్యాయాలు వారు పనిచేసిన అనుభవానికి ఈ గల్లి ప్రజలు తమకు పెట్టుకుంటున్న విన్నపాలను మన్నించి ఈసారైనా ఈ రోడ్డు డ్రైనేజీ బాగు చేసి ఎత్తు నుంచి వస్తున్న నీరు నిలవకుండా క్షేత్రస్థాయిలో డివిజన్లోని ప్రతి గల్లీ తెలిసిన వ్యక్తిగా ఈ సమస్యను ప్రత్యేక దృష్టితో పరిష్కారం చేస్తారని నీటిలో మునుగుతున్న వంపు ఇండ్ల ప్రజలు వేడుకుంటున్నారు. మేము నగరవాసులమే నగరంలో ఉన్నాయి అందరిలాగే ఇంటి పనులు పారిశుధ్య పనులు ఆస్తి పన్ను కడుతున్నప్పటికీ సేవలు పొందడంలో ఎందుకో వెనుక పడ్డామని ఆవేదన చెందుతున్నారు పాలకులు పట్టించుకుంటారని ఆశిస్తున్నామని ప్రజలు వేడుకుంటున్నారు.

---

## వేసవి కాలంలో తాగునీటి సమస్య ఉండకూడదు

### బోరుబావి ప్రెస్సింగ్ చేయడం

### గ్రామ సర్పంచ్ రాత్లావత్ గేమనాయక్

**అచ్చంపేట అక్షిత ప్రతినిధి:** అచ్చంపేట నియోజకవర్గంలోని పదరా మండలం ఇప్పలపల్లి గ్రామంలో వేసవిలో నీటి ఎద్దడి ఉన్నదని గ్రామ సర్పంచ్ రాత్లావత్ గేమ నాయక్ ఆధ్వర్యంల అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ చొరవతో గ్రామంలోని 3వ మరియు 4 వ వార్డులో త్రాగు నీటి సమస్య తీర్చేందుకు గురువారం బోరు బావిని ప్రెస్సింగ్ చేయించగా 3 అంగుళాల నీళ్ళు పడ్డడం జరిగింది. అందుకు సర్పంచ్ రాత్లావత్ గేమ నాయక్ అడగ్గానే సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు



వంశీ కృష్ణ కి ఇప్పలపల్లి గ్రామ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ రాత్లావత్ గేమ నాయక్ తో పాటు ఉప సర్పంచ్ రాగి సాలమ్మ , వార్డు సభ్యులు కృష్ణ , కవిత నరేష్ , గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాగంటి చెన్నారెడ్డి , గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగి శ్రీను ,గ్రామ పెద్దలతో పాటు సామాజిక కార్యకర్త రామావత్ సేవ పాల్గొన్నారు.

---

## ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తు గడువు పొడిగింపు

### - ఎస్సీ కార్పొరేషన్ ఈడి గోపాల్ నాయక్

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ఎస్సీ యాక్షన్ ప్లాన్ ఫేజ్-1 దరఖాస్తు గడువును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి గోపాల్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్యాంకు అనుసంధానంతో టూ వీలర్, త్రీ వీలర్, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ పంపు సెట్లు, మైనర్ ఇరిగేషన్ ,డెయిరీలు,



వ్యవసాయ డ్రోన్లు, వ్యవసాయ పరికరాలు, మల్బరీ పట్టు పురుగుల పెంపకం, పందిరి కూరగాయల పెంపకం, పామాయిల్ మొక్కల పెంపకం, మైనర్ ఇరిగేషన్ కోసం మరియు నైపుణ్య అభివృద్ధి శిక్షణ తదితరాల కోసం ౧+ ాదీవీమీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ ఎస్సి యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---

## బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్ర కేంద్రాలు ప్రారంభం

**త్తుపలి, అక్షిత న్యూస్:** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం బాటసారుల దాహార్తి తీర్చేందుకై చలివేంద్ర కేంద్రాలు ప్రారంభించారు. స్థానికంగా గల వారాహి వాటర్ ప్లాంట్ అధినేత కళ్యాణపు త్రినాధ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కేంద్రాలను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రముఖ వైద్యుడు రమేష్, వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ కేంద్రాలను ప్రారంభించారు. త్రినాధ్ కుమార్తె వర్షశ్రీ జన్మదిన వేడుకల సందర్భంగా ఆయా చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు.







కల్లూరు పట్టణంలో గల ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో, మధిర రహదారి కూడలి ప్రదేశంలో, వారాహి వాటర్ ప్లాంట్ ఎదురుగా ఈ చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరావు, వారాహి సంస్థ యాజమాన్యం కళ్యాణపు త్రినాధ్ ,కళ్యాణ్ సైదులు, లక్ష్మీపురం ఉపసర్పంచ్, భూక్య కృష్ణ, మండల సిపిఐ కార్యదర్శి దామాల దయాకర్,కాంగ్రెస్ నాయకులు గుగులోతు రాంబాబు, గాలంవీరేంద్రతదితరులుపాల్గొన్నారు.